# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని, రైతుకు అన్ని విషయాల్లో అండగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రేపు జరగనున్న నీట్ (యుజి) 2026 పునః పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తెలిపారు.
- ఆంధ్రప్రదేశ్ ను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛాంధ్ర ఉద్యమం ప్రారంభం కావాలని మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి ఆకాంక్షించారు.
- రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని, రైతుకు అన్ని విషయాల్లో అండగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పల్నాడు జిల్లా లింగంగుంట్ల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి తొలుత అంగన్వాడీ కేంద్రాన్నీ, అనంతరం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న రైతు గుడిపల్లి నాగభూషణంకు చెందిన పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని.. రసాయనాల వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పి.ఎమ్. కిసాన్ పథకం కింద 7 వేల రూపాయలు రైతులకు జమ చేశామన్నారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు మారాలని ముఖ్యమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

`ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్` కార్యక్రమంలో భాగంగా లోక్ భవన్‌లో ఈరోజు నిర్వహించిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్ర బిందువు అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో బెంగాల్ ప్రజలు కీలక పాత్ర పోషించారని, ఎంతో మంది గొప్ప నాయకులను ఆ ప్రాంతం దేశానికి అందించిందన్నారు. జాతీయ జెండాను మొదట కోల్‌కతాలోనే ఎగురవేశారని.. దేశ జాతీయ గీతం ఆ రాష్ట్రం అందించిన కానుకేనని గవర్నర్ గుర్తు చేశారు.

=========================

రేపు జరగనున్న నీట్ (యుజి) 2026 పునః పరీక్ష ఏర్పాట్లపై అమరావతిలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో దృశ్య మాధ్యమ సమావేశం ద్వారా ఈరోజు సమీక్షించారు. రాష్ట్రం నుండి 65 వేల 790 మంది అభ్యర్థులు నీట్ పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణను పూర్తిగా పర్యవేక్షించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో పేపర్ లీకేజీ వంటి వదంతులు సృష్టించి ప్రసారం చేసే వారిపై గట్టి నిఘా ఉంచి సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

=========================

ఆంధ్రప్రదేశ్ ను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛాంధ్ర ఉద్యమం ప్రారంభం కావాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె పాత పోలీస్ క్వార్టర్స్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ నివారణపై చిన్నారులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడే చెత్త వేయాలని సూచించారు. తడి-పొడి చెత్త వేరు చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=========================

అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను ముఖ్యమంత్రి తిలకించారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంపై జాతీయ మీడియా ప్రతినిధులతో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అమరావతిలో రేపు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఇంటికి యోగాను తీసుకెళ్లాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ.. ఆధ్యాత్మిక నగరంగా అమరావతిని రూపొందిస్తున్నామని వివరించారు. సాంకేతికతను అనుసంధానించి అధునాతన రాజధానిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

విరామం

=========================

నూతన టెక్స్ టైల్స్ పాలసీ ద్వారా సుమారు 2 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖల మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె ఈరోజు విలేకర్లతో మాట్లాడుతూ... గడిచిన రెండేళ్లలో చేనేత కార్మికులకు 250 కోట్ల రూపాయల విలువైన నూలు రాయితీని ఇచ్చామన్నారు. మంగళగిరిలో 22 కోట్ల రూపాయలతో మెగా క్లస్టర్ మంజూరయిందని, 173 కోట్ల రూపాయలతో విశాఖలో యూనిటీ మాల్ ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

==========================

రాష్ట్రంలో గత రెండేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రెవెన్యూ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన రెవెన్యూ డే వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈరోజు మాట్లాడుతూ... మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారాలు చూపాలని సూచించారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదాల పరిష్కారానికి అధికారులు సానుకూల దృక్పథంతో పని చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి రెవెన్యూ శాఖకు పూర్తి సహకారం ఉంటుందని, రాష్ట్ర అభివృద్ధిలో మరింత సమర్థవంతంగా పని చేయాలని రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు.

==========================

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి.. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ఈరోజు నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు.

==========================

రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. అదే సమయంలో ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. అదే సమయంలో రాష్ట్రంలో వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడి, ఉక్కపోత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

==========================

రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చడమే లక్ష్యమని, అందులో భాగంగా చెత్త రహిత నియోజకవర్గంగా నిడదవోలును తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు పట్టణంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం ప్రభుత్వ సంకల్పం మాత్రమే సరిపోదని.. ప్రజా భాగస్వామ్యం తోడైతేనే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి రోజుకు కనీసం అరగంట సమయం కేటాయించాలని కోరారు.

==========================

సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 24 నెలలు పూర్తయిన సందర్భంగా గుంటూరు జిల్లా తెనాలిలో ఈరోజు సంక్షేమ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి పనులను మంత్రి వివరించారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

==========================

అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు.

==========================

==========================